కథ

ఇంటి ముందు కారు ఆగ గానే కామేశ్వరి లోపలనుండి వచ్చి చూసింది. కారులోంచి కామేశ్వర రావు పూలదండలు చేత్తో పట్టు కొని దిగేడు. మొదట కామేశ్వరి ఆశ్చర్యపోయినా ఆ రోజు ప్రత్యేకత జ్ఞాపకం వచ్చి నవ్వుతూ నిలు చుంది.

ముప్ఫయి ఎనిమిదేళ్ల సర్వీసుకు ఆ రోజుతో విముక్తి అయింది. కంపె నీతో తనకున్న ఋణం ఆ రోజుతో తీరిపోయింది. ఇంక ఆఫీసుకు వెళ్ళన క్కరలేకుండా హాయిగా విశ్రాంతి తీసు కోవచ్చుని ఆనందించడమా? రిటైర్ అయిన తర్వాత ఎలా గడుస్తుందని విచారించడమా? కామేశ్వరరావు మన సులో అనేక ఆలోచనలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అందువల్ల దుఃఖంతో బయటకు నవ్వినట్టు కనబడుతున్నా హృదయం మాత్రం భారంతో నిండిపో యింది.

నలుగురైదుగురు తోటి ఉద్యోగ స్తులు 'పదవీవిరమణ వీడ్కోలు' యిచ్చి ఆఖరిరోజు కదా అని యింటి వరకూ కారులో దిగబెట్టారు. కామేశ్వర రావు అందరికీ పేరుపేరున కృతజ్ఞ తలు చెప్పేడు.

అందరూ "విష్‌యూ హేపీ రిటైర్డ్ లైఫ్" అంటూ వెళ్లిపోయారు.

లోపలకు రాగానే కామేశ్వరి వేడి వేడి కాఫీ యిచ్చింది. పరధ్యాన్నంగా వున్న భర్తని చూస్తూ-"రేపటి నుండి ఆఫీసులో గాడిద చాకిరీ, ఆఫీసర్ చేత చీవాట్లూ తప్పాయనా విచారిస్తు న్నారు?" అని హాస్యమాడింది.

"ఉద్యోగం చేస్తున్నప్పుడు కొన్ని సమస్యలు, యింక రిటైర్ అయాక వచ్చే సమస్యలు కొన్ని.. అదే ఆలోచి స్తున్నాను!" అని అన్నాడు.

"ఇప్పుడు మీకేం సమస్యలు వచ్చిపడ్డాయి?...మీకేం మగవాళ్లు! మీకు ఎప్పటికైనా రిటైర్‌మెంటు అన్నది వుంది. మరి మా సంగతో, బ్రతికు న్నంతకాలం యీ చాకిరీ తప్పదు కదా! ఇంక మా జీవితాలకి ఒక్కసారే విముక్తి!" అని దెప్పి పొడిచింది.




# నేటి నిగమ్యం

విశ్రవేముల సోమనాథ శాస్త్రి

**అన్నీ వదులుకుని మిగిలిన జీవితం కొడుకు దగ్గర ప్రశాంతంగా గడపవచ్చునని ఎన్నో ఆశలతో వచ్చేరు. చివరి రోజుల్లో తమకు అండగా వుంటారని అనుకున్నారు కాని యీ పరిస్థితి ఎదురవుతుందని వూహించలేకపోయారు. ఇప్పుడెక్కడికి పోగలరు? లేక యిలాంటి అవమానాల్ని రోజూ భరిస్తూ వుండగలరా? ఇంత బ్రతుకూ బ్రతికి ఆఖరిదశలో యిలా అనవసరమైన వాళ్లలా పరాయివాళ్లలా ఎలా వుండగలరు?**



"నువ్వన్నది నిజమే కాని మనలాంటి మధ్య తరగతి కుటుంబాలలో యివి తప్పవు.. అయినా మనకాలం వేరు... యీ కాలం వేరు!" అన్నాడు.

"ఏ కాలమూ ఆడవాళ్ల సంగతి యింతే. ఇంకా మేమే నయం యింటిపనితోనే సరిపోతుంది. ఈ రోజుల్లో ఆడవాళ్లు చదువుకుని, ఉద్యోగాలు చేసి అలసి యింటికి వచ్చి, యింటిపని కూడా చేసుకోవాలి! భార్యాభర్తలిద్దరూ ఆఫీసులనుండి ఒక్కలాగే వస్తున్నారా! మరి రాగానే ఏ మగాడు యింటిపని చేస్తున్నాడు? కనీసం కాస్త సాయమైనా చేస్తున్నాడా?" అని నిల దీసి అడిగింది.

కామేశ్వరరావు ఏం జవాబు చెప్పలేకపోయాడు. ఎందుకంటే అలాంటి అలవాటు అందరిలాగే తనకూ లేదు. తన భార్య యింటి ఇల్లాలు కాబట్టి ఎప్పుడూ విసుక్కోలేదు! ఈ సమస్య ఎదురవలేదు! ఇలాంటి భావం ఆమెలో వుందని యిప్పుడే ఆమె బయటపెట్టింది.

"ఇక చాలుగాని. ఏవేవో ఆలోచిస్తూ బుర్ర పాడు చేసుకోకండి. ఈ మాత్రం ఓపిక యిచ్చాడు భగవంతుడు. ఇలాగే వెళ్లిపోతాయి రోజులు" అంది.

"రేపటి నుండి అద్దెకొంపల్లో వుండాలి! వచ్చే పెన్షన్ అంతంత మాత్రం. అందులో సగం యింటి అద్దెకేపోతే మిగతా దాంతో ఎలా గడపగలమూ? అని."

"అందరూ ఎలా బ్రతుకుతున్నారో మనమూ అలాగే. అయినా మనకేమంత వేరేగా ఒంటరిగా ఉండవలసిన కర్మ! అబ్బాయి రమ్మంటున్నాడు. వాడి దగ్గరకు పోయివుంటాం. హాయిగా మనవలతో కాలక్షేపం కూడా అయిపోతుంది" అని ముఖం చాటంత చేసుకుని అంది.

"అది నువ్వు చెప్పినంత సుఖంగా వుండదు!"

"ఎందుకని వుండదు? పెద్ద యిల్లు!... వంట మనిషి! పనిమనిషి! నాకూ, మీకూకూడా పనేమీ వుండదు! కాలుమీదకాలు వేసుకుని కూర్చోవచ్చు!" అంది ధీమాగా.

"ఇప్పటినుండి వాళ్లమీద మన భారం ఎందుకని ఆలోచిస్తున్నాను!"

"ఎందుకు భారం అవుతాము? మన కొచ్చిందాట్లో మన ఖర్చు మనం పెట్టుకుని మిగతాది వాడికే యిచ్చేయుండి! కాస్త సాయంగా వుంటుంది. ఏమంటారు?"

"ఇవన్నీ... సరే! మన స్వతంత్రం మనకి వుండదు! ఇప్పుడు మన యింట్లో మనం వున్నట్టు మన యిష్టప్రకారం వుంటుందా?"

"అంతా మీ అనుమానమే! ఏదైనా మనం అనుకోడంలో వుంటుంది! అయినా మనకేం కావాలి యింక? వాళ్లు పెట్టిందేదో తిని రామాకృష్ణా అని గడిపేద్దాం. ఏమంటారు? ఇలా యిద్దరం లింగు లింగూమని వుంటే ఏం వూసుపోతుంది?"

"ఇరవై నాలుగ్గంటలూ భార్యాభర్తలు అలా ఒకరి మొఖాలొకరు చూస్తూ కూర్చుంటారేమిటి?" అని తనూ నవ్వుతూ అన్నాడు.

"అదే నేనన్నదీని-మీకేం చక్కా మీరు వూరు మీద వూరేగుతారు. ఇంట్లో ఒక్కర్తినీ పడి వుండేది నేనేగా!"

ఇలా ఇద్దరూ తర్జన భర్జనలు చేసుకుని ఆఖరికి కొడుకు దగ్గరికి వెళ్లివుండడానికే నిశ్చయించుకున్నారు.

ఒక నిర్ణయానికి వచ్చాక. అందరి బాకీలు తీర్చేసి, అందరికీ చెప్పి. మూటా ముల్లే సర్దుకుని చాలా ఆనందంగా కొడుకు దగ్గరికి బయలుదేరారు.

స్టేషన్‌కు వద్దకు శ్రీధర్ వచ్చేడు. ఇంటికి వచ్చేసరికి యింట్లో ఎవరూ లేరు. మనవలు యిద్దరూ స్కూళ్ళకు వెళ్లేరు.. కోడలుకూడా ఉద్యోగస్తురాలవడంవల్ల ఆమెకూడా లేదు.


"పిల్లలకి పరీక్షలు. అందుకని స్కూలు మానిపించలేదు. రోజాకు సెలవు యివ్వలేదు. నేను కూడా హాఫ్‌డే లీవుపెట్టి మీకు యిల్లు తెలియదు కదా అని వచ్చాను" అని కొడుకే సంజాయిషీ యిచ్చేశాడు.


ఇంట్లోకి రాగానే అదృష్టవశాత్తూ పాలు పొయ్యి మీద వుండడంవల్ల కాఫీ పెట్టుకుని తాగేరు. కొడుకు శ్రీధర్ కాఫీ తాగి-"అమ్మా యింట్లో అన్నీ వున్నాయి.. చూసుకో, నేను ఆఫీసుకు వెళ్తున్నాను. నాలుక్కల్లా రోజా పిల్లలూ వచ్చేస్తారు!" అని చెప్పి వెళ్లిపోయాడు.

ఎక్కడా వంటా పెంటా చేసినట్టు లేదు. అప్పటికే మధ్యాహ్నం పన్నెండైంది. అన్నీ వెతుక్కుని వంట కానిచ్చేటప్పటికి రెండైంది! మనవలు రాగానే తింటారేమోనని అందరికీ వంట చేసింది. ఇద్దరి భోజనాలూ అయేసరికి మూడైంది!

ఈ విధమైన స్వాగతంతోనే కామేశ్వరరావుకు మతిపోయింది. మనవల్ని చూసి ఏడాది అయింది. క్రిందటేడాది శైలజ పుట్టినరోజుకి వచ్చినప్పుడు చూడడమే. ఆ కబురూ ఈ కబురూ చెప్పుకుంటూ యిద్దరూ ఎదురుచూస్తూ కూర్చున్నారు.

నాలుగున్నర అయేసరికి కోడలు రోజా పిల్లల్నిద్దర్నీ వెంటబెట్టుకుని వచ్చింది. తను పనిచేస్తున్న ఆఫీసుకు దారిలోనే స్కూలు వుండడంవల్ల వెళ్లేట






ప్పుడు దిగబెట్టి వచ్చేటప్పుడు తీసుకువస్తుంది. రాగానే

"వచ్చేశారా?" అని పలకరించింది రోజా.

మనవడూ , మనవరాలూ "నాయనమ్మా! తాతయ్యా!" అంటూ చుట్టేశారు. "ఉదయాన్నే ఎనిమిదిన్నరకు వెళ్లిపోవాలి. ఏదో పిల్లలకీ, మాకూ యింత పప్పూ, అన్నం వండుకుని, వాళ్లని తెమిల్చే సరికే టైం సరిపోదు! అందుకనే మీకు వంట చేయలేకపోయాను! వంటమనిషి రెండురోజుల నుండి రావడం మానేసింది!" అని చల్లగా చెప్పింది.

"పోనీలే అమ్మా! వంటచేయడం ఎంతసేపు. ఇంట్లో అన్నీ వున్నాయి. రాత్రికికూడా వండేశానులే!" అంటూ మనవలిద్దరికీ తెచ్చిన బొమ్మలూ, బట్టలూ చూపెడుతూ కలియమురిగిపోయింది.

తర్వాత అంతా ముభావంగానే జరిగిపోయింది. ముక్కకి ముక్క జవాబు చెప్పడం, అవసరమైనంత మేరకే మాట్లాడడం-యిలా. కోడలు ప్రవర్తించడం, తాము వచ్చేమన్న ఆనందంకన్నా అవిష్టతనే ఎక్కువ కనబర్చడం-కామేశ్వరికీ, కామేశ్వరరావుకీ ఆశ్చర్యం కలిగించింది. ఇలా వుంటుందని వూహించలేకపోయారు.

సాయంత్రం అయిదుగంటలకు శ్రీధర్ వచ్చి ఆప్యాయంగా అమ్మానాన్నలను పలకరించేసరికి యిద్దరి మనసులూ కుదుటపడ్డాయి.

ఆ మర్నాడుదయమే "కూరలు అయిపోయినాయి. అలా తిరగడానికి వెళ్లినపుడు కూరలు తెచ్చి పడేయండి!" అని కామేశ్వరి భర్తతో అంది.

ఆ మాటలు వింటున్న రోజాగాని, శ్రీధర్ గాని ఏమీ అనలేదు. అప్పటినుండి ఇంట్లో సరకుల సంగతి కామేశ్వరి చూసుకుని చెబితే అవి తేవడం కామేశ్వరరావు వంతైంది.

ఇన్నాళ్లూ ఎలా చేసుకొనేదో గాని రోజా ఏడయితేనేగాని లేవకపోవడం, పిల్లలమీద విసుక్కోవడం, లేకపోతే కొట్టడం, తనకుమట్టుకు చేసుకువెళ్లిపోవడం, చూస్తూంటే కామేశ్వరి మనసు చివుక్కుమనేది.

ఇంత అడుతూ పడుతూ, బాధపడుతూ చేసుకుంటూంటే కాస్త సాయమైనా చేయదని కోడలు అంటుందేమోనని ఉదయం అయిదుగంటలకే లేచి వంట చేయడం తప్పలేదు కామేశ్వరికి.

"ఎందుకు మీకీ శ్రమ? యిన్నాళ్లూ చేసుకుంటున్నదేకదా!" అని రోజా అనలేదు. 'నువ్వు కాకపోతే ఎవరు చేస్తారు!' అన్నట్టు వూరుకుంది.

బజారునుండి సామాన్లు తెస్తుంటే "ఎందుకండీ నాన్నగారూ మీరు తేవడం?" అని శ్రీధర్ అనలేదు.

ఇంక అప్పటినుండి యింటిపని కామేశ్వరిదీ, బజారుపని కామేశ్వరరావుదీ అయిపోయాయి. ఇంతకన్నా తామిద్దరూ వేరేగా వుంటేనే బావుండేదేమోననిపించింది.

కారణం ఏమిటోగాని మరి వంటమనిషి రాలేదు. పనిపిల్ల మాత్రం రోజూ వచ్చి దానిపని అది చేసుకుపోతూండడంవల్ల కామేశ్వరికి కొంత భారం తగ్గింది. కోడలు ఎంత అవిష్టత చూపుతున్నా మనవలు మాత్రం ఇంట్లో వున్నంతసేపూ వదలరు. తమ దగ్గరే పడుకుంటారు. కథలు చెప్పమని మారాం చేస్తారు. వాళ్లని వదలలేకే కోడలు చూపే విముఖత భరిస్తున్నారు.

"పిల్లలకి స్కూలు మూడున్నరకే అయిపోతుంది. అప్పట్నుంచి వాళ్లమ్మ తీసుకువచ్చేవరకూ అలా స్కూల్లో వుత్తినే ఆడుతున్నారు. మీరుంటున్నారు కాబట్టి వాళ్లను యింటికి తీసుకువచ్చేస్తే బావుంటుంది నాన్నగారూ... యింటిదగ్గర వాళ్లకు మీరు నాలుగుముక్కలు చెబితే.. వాళ్లూ బాగా చదువుకుంటారు" అన్నాడు శ్రీధర్.

"అలాగేరా అబ్బాయీ. నాకు మాత్రం పనేముంది... నాకూ వూసుపోతుంది. వాళ్లకూ చదువొస్తుంది!" అనేశాడు కామేశ్వరరావు. అప్పటినుండి అదొక నిత్యకృత్యమైపోయింది.

ఒకనాడు పనిపిల్ల పని పూర్తిచేసుకుని యింటికి వెళ్లిపోతూ "పెద్దమ్మగారూ, రేపటినుండి మరి పనిలోకి రానండి!" అని తలవంచుకు చెప్పింది.

వంటమనిషి మానేసినా అలవాటైన పనే కాబట్టి ఎలాగో సర్దుకుపోతూందిగాని యిల్లు తుడవడం, అంట్లు తోమడం, నీళ్లు తేవడం-ఇవన్నీ తన తరమా? ఇది కూడా మానేస్తే ఎలా? అని భయపడుతూ-"అదేమే! ఎందుకు మానేస్తున్నావు?" అని అడిగింది కామేశ్వరి.

పదేళ్ల ఆ పిల్ల కంట తడిపెట్టుకుంటూ "అమ్మగారు చీటికిమాటికీ నన్ను కొడుతున్నారమ్మా" అని ఏడుస్తూ చెప్పింది.

"నిన్ను కొడుతున్నదా? నిజమా?" అని అడిగింది ఆశ్చర్యపోతూ.

"నిజం అమ్మగారూ! కావలిస్తే చూడండి!" అని చేతులమీదా, మెడమీదా గోళ్లతో గిల్లినట్టు వున్న రక్కుల్ని చూపింది.

"అంత కోపం ఎందుకొచ్చిందే? చెప్పినట్టే అన్ని పనులూ చేస్తున్నావుగా...!"

"అయినా ఏ తప్పూ లేనిదే కొడుతున్నారు. ఏ వస్తువు కనబడకపోయినా నేనే తీశానంటున్నారు" అని ఏడవడం మొదలెట్టింది.

"బావుందే! ఏదో నువ్వన్నావు ఎలాగో యీడ్చుకొస్తున్నాను. ఇక నువ్వు మానేస్తే ఎలాగే?"

"అమ్మగారూ!" అంటూ రహస్యం చెబుతున్నట్టు అంది పనిపిల్ల.

"ఏమిటే?" అని అడిగింది ఆశ్చర్యపోతూ.

"ఎదురింటి సుబ్బమ్మగారితో మీ మీద ఏమిటేమిటో చెబుతున్నారండీ."

"నా మీద ఏమున్నాయి చెప్పడానికి?"

"ఏమోనండీ మీరొచ్చిన దగ్గర్నుండీ ఖర్చులు

లావైపోతున్నాయనీ, డబ్బు చాలడం లేదనీ యిష్టమొచ్చినట్టు వండి పారపోస్తున్నారనీ.. యింకా ఏవేవో..." అని చెప్తుంటే.

"అలాగా?" అని కామేశ్వరి మరేమీ అడగకుండా వూరుకుంది.

ఎదురింటి సుబ్బమ్మగారు మునుపటిలా మాట్లాడకపోవడం.. ముఖం చాటేసుకోవడం, ఎదురుపడినా ముభావంగా వుండడం చూసి మనసులో అనుమానం కలిగిందిగాని, ఎందుకో ఏమిటో అనుకుంది గాని చెప్పుడు మాటలవల్లేనని యిప్పుడర్థమవుతూంది! తన కోడలే తనమీద యిలా అబద్ధాలు చెబుతుందని కలలోకూడా అనుకోలేదు.

ఇన్నాళ్లూ అందరి దగ్గరా గౌరవంగా బ్రతికింది. ఎప్పుడూ ఎవరి దగ్గరా మాటపడలేదు. చిన్నప్పుడే అత్తగారింటికి వచ్చేసింది. అప్పటినుండి అత్తయ్యా, తనూ తల్లీ కూతుళ్లలా వుండేవారు అంతేగాని ఎన్నడూ మాటామాటా అనుకోలేదు. అలనాటిది యీ నాటికి కోడలిదృష్టిలో చెడ్డవడం, ఏ పాపం ఎరుగని తను నిందలు పడడం యివన్నీ ఆమె మనసును కలచివేశాయి. అయినా తనవల్ల తప్పుంటే కదా భయపడడానికి? నిజం నిలకడమీదే తెలుస్తుంది అని సమాధానపరుచుకుంది.

భర్తతో చెబితే 'నేను ముందే చెబుతే విన్నావా!' అని తననే అంటారేమోనని తనలోనే మథనపడుతూంది.

కామేశ్వరరావుకు యిదంతా కనిబెట్టకపోలేదు. ఆ రోజు యింటికి రాగానే రోజా "ఇందరున్నారు యింట్లో, ఏం చేస్తున్నారు? ఇల్లంతా యిలా వుంటే చూసుకోవద్దా?" అనీ, "పెట్టిన వస్తువు పెట్టినట్టు వుండదు. ఏ అవసరం వస్తుందో ఏమిటో?" అనీ, "చచ్చీచెడీ వస్తే యింత కాఫీపోసే దిక్కయినా లేదు!' అని, విసుక్కోవడం సూటిపోటి మాటలనడం మొదలుపెట్టింది.

అన్నీ వింటూనే వున్నారు కామేశ్వరరావు.

ఇంట్లో కాఫీ పొడి, టీ పొడి అయిపోయినాయి. ఆ సంగతి తెలీకే అలా అంటున్నదా? నెలమీద వారం రోజులు గడిచాయి. నెలసరి సామాన్లు ఒక్కొక్కటే అయిపోతున్నాయి తెలీదా? కావాలనే తేలేదా?

అన్నట్టుగానే పనిపిల్ల ఆ మర్నాటినుండీ రావడం మానేసింది. అదేమీ పట్టనట్లు రోజా ఉదయాన్నే లేచి తను తెమిలి పిల్లల్ని తీసుకుమని వెళ్లిపోయింది. ఆ తర్వాత చూస్తూచూస్తూ వూరుకోలేక యింటిపనంతా కామేశ్వరి చేసుకుక తప్పలేదు.

వంటమనిషీ, పనిమనిషీ రాకపోయినా శ్రీధర్ తనకు తెలియనట్టు ఎందుకని అడగకుండా వూరుకున్నాడు.

ఇదంతా చూస్తూ తన నోటితో 'వెళ్లిపోండి' అని చెప్పకుండా 'పొమ్మనలేక పొగపెట్టినట్టు' కోడలు చేస్తూందని, కామేశ్వరీ, కామేశ్వరరావూ గ్రహించారు.

అన్నీ వదులుకుని మిగిలిన జీవితం కొడుకు దగ్గర ప్రశాంతంగా గడపవచ్చునని ఎన్నోఆశలతో వచ్చేరు. చివరి రోజుల్లో తమకు అండగా వుంటారని అనుకున్నారు కాని యీ పరిస్థితి ఎదురవుతుందని వూహించలేకపోయారు. ఇప్పుడెక్కడికి పోగలరు? లేక యిలాంటి అవమానాల్ని రోజు భరిస్తూ వుండగలరా? యింత బ్రతుకూ బ్రతికి ఆఖరిదశలో యిలా అనవసరమైనవాళ్లలా పరాయివాళ్లలా ఎలా వుండగలరు?

ఒకరోజు భోజనాలైన తర్వాత కామేశ్వరరావు కొడుకుతో "కొన్నాళ్లపాటు మీ అమ్మా, నేనూ యాత్రలు చేసి వస్తాం" అని అన్నాడు.

"అవున్రా, యిన్నాళ్లూ నాన్నగారి ఉద్యోగంతోనే సరిపోయింది! ఎప్పుడూ సెలవు దొరకదనో, తీరుబడి లేదనో గడిపేవారు. ఈ మాత్రం ఓపిక వున్నపుడే నాలుగూ తిరిగివస్తాం" అన్నది కామేశ్వరి.

"మీ యిష్టం, అమ్మా, జాగ్రత్తగా వెళ్లిరండి ఆరోగ్యాలు జాగ్రత్తగా చూసుకోండి" అని అన్నాడు శ్రీధర్.

ఇద్దరూ బయల్దేరారు.

తిన్నగా హృషీకేశ్ చేరుకున్నారు. అక్కడ ఒక ధర్మసంస్థ నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో చేరిపోయారు. కామేశ్వరి యిదంతా చూసి ఆశ్చర్యపోయింది.

"యాత్రలకు వెళదామని చెప్పి యిక్కడే వుండిపోతామనంటున్నారేమిటి?" అని అడిగింది.

'అవును. ఇలా జరుగుతుందని ముందే వూహించి యీ ఏర్పాటు చేశాను. ఇహ యిక్కడే మన శేషజీవితం పూర్వం పల్లెటూళ్లలో పొలాలూ, వంటలూ చూసుకుని స్థిరంగా వుండేవారు. తర్వాత పిల్లలు ఉద్యోగాలలో ప్రవేశించడం మొదలైన తర్వాత వాళ్లేవచ్చి చూసి పోతుండేవారు. ఉద్యోగాల నుండి రిటైర్ అయేక వాళ్లే పిల్లల దగ్గరికి వెళ్లి వుంటూ వుండేవారు. అది ఆనాటి గమ్యం. కాలం మారింది. మనలాంటివాళ్లకి యిలాంటి వృద్ధాశ్రమాలే నేటి గమ్యం! ఇక్కడైతే భక్తీ, ముక్తీ రెండూ లభిస్తాయి" అని అన్నాడు.

"మీరన్నది నిజమే. ఇక్కడ చాలా ప్రశాంతంగా వుంది" అన్నది కామేశ్వరి. ■

